

హాన్స్ అదృష్టం

గ్రిమ్ సోదరులు




హాన్స్ అదృష్టం

గ్రిమ్ సోదరులు






హాన్స్ తన యజమాని దగ్గర ఏడు సంవత్సరాలు పని చేశాడు.
"ఇప్పుడు, నేను మా అమ్మను చూసుకోవాలి," యజమానితో హాన్స్ అన్నాడు.
"నువ్వు బాగా పని చేశావు. అందుకు ప్రతిఫలం ఇదిగో," అంటూ అతడి యజమాని దాదాపు అతడి తల అంత బరువున్న బంగారం ముద్దని అతడికి ఇచ్చాడు.



బంగారాన్ని గుడ్డలో చుట్టి భుజానికి
వేసుకున్నాడు హాన్స్. ఇంటివైపు ప్రయాణం
మొదలుపెట్టాడు.


బంగారం బరువుకి కొంచెం సేపటికి
అతడు అలసిపోయాడు. అప్పుడు,
ఎదురుగా గుర్రం మీద స్వారీ చేస్తూ
వస్తున్న వ్యక్తి కనపడ్డాడు.



“ఈ బంగారం ముద్ద మొయ్యటం కంటే గుర్రం మీద స్వారీ చేస్తూ వెళ్ల గలిగితే ఎంత బాగుంటుంది!" అన్నాడు హాన్స్.

“నీ బంగారం ముద్ద నాకు ఇస్తే, నా గుర్రాన్ని నీకు ఇవ్వటానికి అభ్యంతరం లేదు," గుర్రం రౌతు అన్నాడు.

“సంతోషంగా ఇస్తాను," హాన్స్ అన్నాడు. “కానీ, ముందే చెబుతున్నాను. నా బంగారం ముద్ద చాలా బరువు ఉంది."





గుర్రం మీద నుంచి కిందకి దిగిన రౌతు బంగారం తీసుకున్నాడు. గుర్రం మీదకి ఎక్కటానికి హాన్స్‌కి సహాయం చేశాడు.

"గుర్రం వేగంగా వెళ్లాలనుకున్నప్పుడు కళ్లెం అదిలించి, 'చల్-చల్!' అన్నావంటే చాలు!" చెప్పాడు రౌతు.

గుర్రాన్ని ఎక్కిన హాన్స్‌కి చాలా సంతోషంగా ఉంది. కొంత దూరం వెళ్లిన తరవాత వేగంగా వెళదామనిపించింది. కళ్లాన్ని అదిలించి, "చల్-చల్!" అన్నాడు.






గుర్రం వేగంగా పరిగెత్తటం మొదలుపెట్టింది. దానిని హాన్స్ నియంత్రించ లేకపోయాడు. దాంతో చివరికి ఒక గోతిలో పడ్డాడు.



అదే సమయంలో ఒక రైతు ఒక ఆవుతో అటుగా వస్తున్నాడు. గుఱ్ఱం పారిపోకముందే దాన్ని పట్టుకున్నాడు. చాలా కష్టపడి గోతిలో నుంచి హాన్స్ బయటకు వచ్చాడు. అతడికి చాలా బాధగా ఉంది.


"ఇటువంటి గుఱ్ఱాన్ని ఎప్పుడూ స్వారీ చెయ్య లేదు. ఇది నా మెడ విరగొట్టినంత పని చేసింది," రైతుతో చెప్పాడు హాన్స్. "నీ లాగా ఆవు వెనక మెల్లగా వెళుతుంటే ఎంత బాగుంటుంది. ఇది ప్రతి రోజూ పాలు ఇస్తుంది, పెరుగు, మీగడ, వెన్న దొరుకుతాయి."




“అలాగయితే నీ గుర్రాన్ని తీసుకుని బదులుగా నా ఆవుని ఇస్తాను," అన్నాడు రైతు.

హాన్స్ దీనికి సంతోషంగా ఒప్పుకున్నాడు. అంతా మంచి జరగాలని చెప్పి గుర్రాన్ని ఎక్కి రైతు వెళ్లిపోయాడు.

“రొట్టెలోకి వెన్న, తాగటానికి కావలసినన్ని పాలు కంటే ఇంకేం కావాలి?" అనుకున్నాడు హాన్స్.




తన అదృష్టానికి మురిసిపోతూ ఆవు వెనకాల హాన్స్ వెళ్లసాగాడు.



మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉంది, రోడ్డు కూడా చుర్రుమంటోంది. హాన్స్‌కి బాగా దాహం వేసింది. దాంతో ఆవును కట్టేసి తన తోలు టోపీలోకి పాలు పిదకటానికి పూనుకున్నాడు.

ఆవు చన్నుల నుంచి ఒక్క చుక్క పాలు కూడా రాలేదు. పైగా
అది తన్నటంతో హాన్స్ గాలిలోకి ఎగిరి కింద పడ్డాడు.







అప్పుడు, ఆ దారి వెంట ఒక వ్యక్తి ఒక పందిని తోలుకుంటూ వెళుతున్నాడు. "ఏమయ్యింది?" అని అతను హాన్స్‌ని అడిగాడు. అతడు మొదటినుంచి తన కథ మొత్తం చెప్పుకొచ్చాడు.

హాన్స్‌కి తాగటానికి నీళ్లు ఇచ్చి, "నీ ముసలి ఆవుని ఇచ్చి బదులుగా నా బలిసిన పందిని తీసుకుంటావా?" అని అడిగాడు.

“నువ్వు చాలా మంచివాడివి!" అంటూ హాన్ తన ఆవుని అతనికి ఇచ్చి, అతని పందిని తాను తీసుకున్నాడు. పందిని తీసుకుని వెళుతూ తనంత అదృష్టవంతుడు లేడనుకున్నాడు హాన్స్.





దారిలో ఒక బాతుని తీసుకుని వెళుతున్న ఒక వ్యక్తిని హాన్స్ కలిశాడు. అతడు చాలా స్నేహశీలి లాగా కనిపించాడు. దాంతో అతడికి ఆ రోజు అదృష్టాల గురించి హాన్స్ చెప్పాడు.

తన బాతు ఎంత మంచిదో ఆ వ్యక్తి చెప్పాడు,


"ఒక్కసారి చేతుల్లోకి తీసుకుని చూడు బాతు ఎంత బరువుందో!"


"అవును, నిజమే," అన్నాడు హాన్స్. "కానీ, నా పంది కూడా తక్కువ బరువేమీ లేదు."



ఆ వ్యక్తి నాలుగు వైపులకూ చూసి హాన్స్ చెవిలో గుసగుసగా చెప్పాడు, “ఈ పంది నిన్ను కష్టాలలో పడవేస్తుంది. నిన్న రాత్రి ఒక ఊళ్లో పందిని దొంగిలించారని విన్నాను. అందరూ దాని కోసం వెదుకుతున్నారు."

అది విన్న హాన్స్ ముఖం భయంతో పాలిపోయింది. “నేను ఈ ప్రాంతానికి కొత్తవాడిని. నాకు నువ్వే సాయం చెయ్యాలి. నా పందిని తీసుకుని, నీ బాతుని నాకు ఇవ్వు."





"కష్టాలలో ఉన్నవాళ్లకు సాయం చెయ్యకపోతే ఎలా," అని ఆ మనిషి బాతుని ఇచ్చి పందిని తీసుకుని వెళ్లిపోయాడు.


బాతుని చంకలో పెట్టుకుని హాన్స్ ఇంటికి వెళుతున్నాడు. దానిని చూసిన అమ్మ ఎంతో సంతోషిస్తుందని అనుకున్నాడు.



దాదాపు ఇంటికి దగ్గరలో ఉన్నప్పుడు చాకులు పదును పెట్టే ఒక వ్యక్తి హాన్స్‌కి కలిశాడు. అతడు తన పని చేసుకుంటూ కూనిరాగాలు తీస్తూ ఉన్నాడు.

హాన్స్ కాసేపు అతనినే చూస్తూ ఉన్నాడు.

చివరికి, “మీ సంపాదన బాగుంటుందనుకుంటా, మీరు చాలా సంతోషంగా ఉన్నారు,” అన్నాడు.



“అవును. నీకు కూడా డబ్బు సంపాదించాలని ఉంటే ఈ పని మొదలుపెట్టు. నీ బాతుని ఇచ్చావంటే మంచి సానరాయిని నీకు ఇస్తాను," అతను అన్నాడు.


“నా జేబులో ఎప్పుడూ డబ్బు ఉంటే నా కంటే సంతోషకరమైన వ్యక్తి ఈ ప్రపంచంలోనే ఉండడు," అంటూ హాన్స్ అతడికి తన బాతుని ఇచ్చి అతని దగ్గర నుంచి ఒక పాత సానరాయిని తీసుకున్నాడు.

సానరాయిని తీసుకున్న హాన్స్ కళ్లు సంతోషంతో మెరిశాయి.

“నేను కోరుకున్నదల్లా జరుగుతూనే ఉంది," హాన్స్ అన్నాడు.




సానరాయి చాలా బరువుగా ఉంది. హాన్స్ మెల్లగా నడుస్తున్నాడు. కొంత దూరం వెళ్లిన తరవాత ఒక బావి వచ్చింది. బావి గట్టు మీద సానరాయిని పెట్టి, నీళ్లు తాగబోయాడు.



నీళ్లు తాగటానికి హాన్స్ వంగినప్పుడు అతడి చెయ్యి తగిలి సానరాయి బావిలో పడిపోయింది.


ఆ బరువైన సానరాయి భారం వదిలిపోవటంతో హాన్స్ సంతోషంతో ఎగిరి గెంతేశాడు.

“నా కంటే అదృష్టవంతుడు ఈ ప్రపంచంలోనే లేడు," హాన్స్ అరిచాడు.





ఏ బాదరబందీ లేకుండా హాన్స్ ఇంటికి
చేరుకున్నాడు. ఆ రోజు తన అదృష్టం ఎంత
బాగుందో అమ్మకి మొత్తం చెప్పాడు.



అయిపోయింది